క్లుప్తంగా

రేపు మండల సమావేశం

సిద్దవటం : సిద్దవటం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 28వ తేదీన(రేపు) జరుగుతుందని ఎంపీడీఓ ఫణిరాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 10.00 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై చర్చ చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు.

రేపటి నుంచి మాతమ్మ జాతర



సుండుపల్లె : ఈనెల 28వ తేదీ అనగా రేపటి నుంచి పెద్దమాదిగపల్లెలో వెలసివున్న మాతమ్మ తల్లి జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రికి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో మేళతాళాలు, బాణసంచాలు కాలుస్తూ గ్రామంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. 29వ తేదీ గురువారం ఉదయం గావుపట్టుట, పుట్ట బంగారు తెచ్చి పూజించడంతోపాటు పొంగుబాలు తెచ్చి పొంగుపెట్టడం, సిద్దులకు ఒకపొద్దు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని మొక్కుబడుల్లో భాగంగా రాత్రికి చాందినీబండ్లు ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉదయం బోనాల కార్యక్రమం ఉంటుందని కావున భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని గ్రామస్తులు కోరారు.

బాధ్యతల స్వీకరణ



లక్ష్మిప్రసాద్‌రెడ్డి, ఎస్‌ఐ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నూతన ఎస్‌ఐగా లక్ష్మిప్రసాద్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. రాజంపేట విధులు నిర్వహిస్తూ కోడూరుకు బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిభందనలు పాటించాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఇబ్బందులు పడక తప్పదని హెచ్చరించారు.

29న ఉచిత కంటి వైద్య శిబిరం

సుండుపల్లె : మండల కేంద్రంలోని ఆరెమ్మ దేవాలయం వద్ద గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు యర్రపురెడ్డి ఆరంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆస్పత్రి వైద్యులు ఆధ్వర్యంలో గురువారం ఉదయం (మే 29న) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని తిరుపతికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయించి తిరిగి ఇళ్లకు చేర్చనున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని ప్రజలందరూ ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

29న గంగమ్మ జాతర

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని కొత్తకోడూరు గంగమ్మ జాతరను ఈనెల 29న ఘనంగా నిర్వహించనున్నట్లు సోమవారం నిర్వాహక కమిటీ వారు పేర్కొన్నారు. జాతరలో భాగంగా ఘటంకుండ, దున్నపోతుకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది సంప్రదాయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు.

ఆకేపాటికి సన్మానం



ఆకేపాటికి కృతజ్ఞతలు తెలుపుతున్న సుధాకర్

రాజంపేట టౌన్ : వైఎస్సార్ సీపీ రాష్ట్ర దివ్యాంగుల ప్రధాన కార్యదర్శి దార సుధాకర్ సోమవారం ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మేధావుల ఫోరం కార్యదర్శి అరిగెల సౌమిత్రి, నందలూరు మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు మోడపోతుల సుధ, బెస్త సంఘం అధ్యక్షుడు పోలుబోయిన వెంకటసుబ్బయ్య, పెనుబాల శ్రీనివాసులు, అనమల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యోగభోగేశ్వరుడికి రుద్రాభిషేకం

మదనపల్లె సిటీ : స్థానిక బెంగుళూరురోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి రుద్రాభిషేకం చేశారు. కృత్తికా నక్షత్రం పురస్కరించుకుని అర్చకులు విశ్వేశ్వరప్రసాద్, మురళి శ్రీవల్లిదేవసేన సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు చేశారు.

కొండ మామిడికి భలే గిరాకీ

- పచ్చళ్లకు ప్రత్యేకం
- మాగిన పులుపు రుచి అద్భుతం



మండల కేంద్రంలో విక్రయిస్తున్న నోరూరించే కొండ మామిడికాయలు

ఓబులవారిపల్లె : శేషాచలం అడవిలో దట్టమైన తలకోన ప్రాంతంలో మాత్రమే లభించే కొండ మామిడికి వేసవిలో భలే గిరాకీ ఉంటుంది. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోనే మామిడి కాయలకు రైల్వేకోడూరు నియోజవర్గం పేరు గాంచింది. అయితే సాధారణ మామిడి కాయలను రైతులు తోట ద్వార పండిస్తారు. అరుదైన కొండ మామిడి కాయలు మాత్రం దట్టమైన అడవులో భారీ మామిడి వృక్షలకు మాత్రమే లభిస్తాయి.

ఊరగాయ నిల్వ చేసేందుకు దోహదం

శేషాచల అడవుల నుంచి భారీ మామిడి వృక్షల నుంచి అతి కష్టం మీద ప్రమాదాలను లెక్క చేయకుండా తీసుకొని వచ్చి గ్రామాలకు తరలించి విక్రయలు చేస్తుంటారు. ఏడాది పొడవునా నిలువ ఉండే పచ్చళ్లకు కొండ మామిడి కాయలు ప్రసిద్ధి. సాధారణ మామిడి పండు పచ్చిగా ఉండి కొద్ది రోజులకు మాగడంతో తీపి వస్తుంది. కొండ మామిడి కాయ మాత్రం ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. కాయలో పీచు ఎక్కువగా ఉండి పుల్లగా ఉంటుంది. పక్వానికి వచ్చిన తరువాత కూడా ఎక్కువ పుల్లగా ఉంటుంది. వేసవి చివరి దశలో కొద్ది రోజుల మాత్రమే ఈ మామిడి కాయలు లభిస్తాయి. దీంతో పచ్చళ్లకు ఎక్కువగా ఉపాయోగిస్తారు. పీచు ఎక్కువగా ఉండటంతో అధిక కాలం నిల్వ ఊరగాయలు నిల్వ ఉండేందుకు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.150 నుంచి రూ.200 దాక ధర పలుకుతోంది. ఓబులవారిపల్లె మండల కేంద్రంలో మాత్రమే తలకోన, నరబైలు తదితర ప్రాంతల నుంచి ఇక్కడికి తీసుకొని వచ్చి విక్రయిస్తుంటారు. అన్నమయ్య, వైఎస్సార్ రెండు జిల్లాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున ఇక్కడి నుంచి మామిడి కాయలను కొనుగోలు చేస్తుంటారు. పచ్చళ్లకు సీజన్ కావడంతో అరుదైన కొండ మామిడి కాయాలకు గిరాకీ పెరిగింది.

ఊరగాయ ఎక్కువ కాలం ఉంటుంది



కొండ మామిడి కాయలు వేసవికాలంలోనే లభిస్తాయి. పీచు ఎక్కువగా ఉండి పులుపు ఉంటడంతో ఏడాదికి సరిపడా ఊరగాయ వేసేందుకు అనుకూలం. రూచి కూడా బాగా ఉంటుంది. దీంతో ఖర్చు ఎక్కువ అయిన ప్రతి ఏడాది కొండ మామిడికాయలు ఊరగాయలకు ఉపాయోగిస్తాం.

– యు.లోకేశ్వర్‌రెడ్డి, పున్నాటివారిపల్లె, ఓబులవారిపల్లె

తీసుకొని రావడం చాలా కష్టం



తలకోన అడవులలో పెద్దపెద్ద మామిడి చెట్లపై నుంచి చాలా కష్టం మీద కొండ మామిడి కాయలను కోసి అక్కడి నుంచి కాలినడకన బయటకు తీసుకొని వచ్చి. ప్రైవేటు వాహనాల్లో పట్టణాలు, గ్రామాలకు తీసుకొచ్చి అమ్మాలి. ఈ మామిడి కాయలు అరుదుగా దొరుకుతాయి. కష్టానికి తగ్గ డిమాండ్ ఉంటుంది.

– సయ్యద్ నజీర్, మామిడి వ్యాపారి, ఓబులవారిపల్లె

మండల కేంద్రంలో మాత్రమే లభిస్తాయి



వ్యాపారులు ఇతర ప్రాంతల నుంచి మండల కేంద్రం చిన్నఓరంపాడు అడ్డరోడ్డుకు తీసుకొని వచ్చి కొండ మామిడి కాయాలు విక్రయిస్తుంటారు. కడప, రైల్వేకొడూరు, రాజంపేట ఎక్కడా ఈ మామిడి కాయలు దొరకవు. చాలా మందికి వీటిని ఏ విధంగా ఉపాయోగించాలో కూడా తెలియదు. ఒక్క సారి ఈ కాయలను పచ్చళ్లలో ఉపాయోగించిన వారు ఇతర ప్రాంతల నుంచి అదే పని మీద వచ్చి కొనుగోలు చేసి తీసుకొని పోతుంటారు.

– షేక్ ఖాదర్‌సాహెబ్, రైతు, ఓబులవారిపల్లె

యోగాంధ్రలో విద్యార్థుల సూర్య నమస్కారాలు



పుల్లంపేట : విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయిస్తున్న ఉపాధ్యాయుడు రమణ

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రలో భాగంగా సోమవారం ఉపాధ్యాయుడు రమణ విద్యార్థులకు సూర్య నమస్కారాలు నేర్పించి పిల్లలచే సాధన చేయించారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ సూర్య నమస్కారాలు యోగాలో ఒక ప్రధాన భాగమని, దీని వల్ల మానసిక ఒత్తిడి తగ్గి, కండరాల మధ్య సమన్వయం పెరుగుతుందని, అలాగే జీర్ణశక్తి పెరిగి ఎముకలు కూడా బలంగా తయారవుతాయన్నారు. పిల్లలు ప్రతిరోజూ సాధన చేయడం ఆరోగ్యానికి మంచిదని తెలియజేశారు.

అందరూ భాగస్వామ్యులు కావాలి



రాజంపేట టౌన్ : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

రాజంపేట టౌన్ : యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా సర్కిల్‌లో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరిది ఉరుకులు, పరుగులమయమైన జీవనం అయిందని, అందువల్ల అనేక మంది వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధుల బారీన పడుతున్నారన్నారు. అయితే ఒత్తిడిని జయించేందుకు యోగా దివ్యౌషధంలా పనిచేస్తుందని చెప్పారు. జూన్ 21వ తేదీ విశాఖపటన్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

శివపార్వతులకు పూజలు



పెనగలూరు : మండల కేంద్రంలో కొలువైన శివపార్వతులకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామాక్షి దేవిని తమలపాకులు, పూలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించి మహిళలు తెల్లవారుజాము నుంచే పూజా కార్యక్రమాలు జరిపించారు. అలానే శివలింగాన్ని అలంకరించి పూజలు చేసినట్లు గ్రామ పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య, ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మలు తెలిపారు. భక్తులకు ప్రసాదాన్ని పంచిపెట్టారు.

పొలాల వద్దకు దారి చూపండి సారూ..

జిల్లా కలెక్టర్‌కు సోమబట్లవారిపల్లి, అగ్రహారం వాసుల వినతి



సమస్యను కలెక్టర్‌కు విన్నవిస్తున్న రైతులు

రాయచోటి : పూర్వీకుల నుంచిపొలాల వద్దకు వెళ్లే కాలిబాట, బండ్లబాటను మూసివేసిన రోడ్డును తెరిపించాలని సోమబట్లవారిపల్లి, అగ్రహారం వాసులు జిల్లా కలెక్టర్‌కు వినతి చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా పరిధిలోని లక్కిరెడ్డిపల్లి మండలం కుర్నూతల గ్రామం సోమబట్లవారిపల్లి, అగ్రహారానికి చెందిన రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పూర్వీకుల నుంచి తమ పొలాల వద్దకు వెళ్తున్న దారిని మూసివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వేడుకున్నారు. గ్రామానికి అర్ధ కిలోమీటర్ దూరంలో ఉన్న పొలాల వద్దకు రైతులు పూర్వకాలం నుంచి కాలిబాట, బండ్లబాటన వెళ్లి పంటలు సాగు చేసుకునేవారమని చెప్పారు. దెయ్యాలవాండ్లపల్లికి చెందిన బాబా ఫక్ర్రుద్దీన్, మల్లి ఇరువురు వ్యక్తులు రోడ్డు పక్కన ఉన్న భూములను కొనుగోలు చేసి కొనుగోలు భూములకు సమీపంలో ఉన్న రైతుల భూములను కూడా మాకే విక్రయించాలని పట్టుబట్టారన్నారు. వారికి విక్రయించకపోవడంతో కక్షపెట్టుకుని పూర్వకాలం నుంచి పొలాల వద్దకు వెళ్లే కాలిబాట, బండ్లబాటను మూసివేశారన్నారు. ఈ విషయంపై పలుమార్లు స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. పొలాలకు వెళ్ల నివ్వకపోవడంతో పంటలు పెట్టక బీడుబారి పోయాయన్నారు. జిల్లా ఉన్నతాధికారులు దారి సమస్యపై విచారించి పొలాల వద్దకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

జిల్లా అభివృద్ధికి నిధులు ఇవ్వాలి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా రాయచోటి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఒక ప్రకటన ద్వారా పలు సమస్యలపై వివరించారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని శాశ్వత ప్రతిపాదికన కొనసాగించాలని కోరారు. జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని మారుస్తారనే అనుమానాలను తొలిగించాలన్నారు. అలాగే కడప – మదనపల్లె – బెంగుళూరు రైల్వే లైన్ నిధులు మహానాడు వేదికగా కోరాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా తాగునీరు, సాగు నీరు అందించేందుకు మండిపల్లి నాగిరెడ్డి (శ్రీనివాసపురం రిజర్వాయర్) కాల్వ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు, వై.ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు త్వరగతిన పూర్తి చేయాలని కోరారు.మామిడి రైతులకు మేలు జరిగే విధంగా మార్కెట్ యార్డు ద్వారా అమ్మకాలు, కొనుగోలు చేయాలని కోరారు.

పోస్టల్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 31 నుంచి జూన్ 4 లోపల పోస్టల్ ఖాతాదారులు తమ ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానం చేసుకునేందుకు ఎన్‌పిసిఐ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఖాతాదారులు ఆధార్‌తో బ్యాంకు ఖాతాలను అనుసంధానం చేసుకోవాలన్నారు. పోస్టల్ శాఖ, సచివాలయ సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వాధికారుల సమన్వయంతో జూన్ 5 లోగా ఆధార్ సీడింగ్ ఎన్‌పీసీఐ లింకేజీ తెరవడంతో పాటు వారికి నూతన పోస్టల్ బ్యాంకింగ్ ఖాతాలను తెరవనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరాకాష్టకు చేరిన రెడ్‌బుక్ పాలన



పాపినేని విశ్వనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన పరాకాష్టకు చేరిందని అయితే రెడ్‌బుక్ రాజ్యాంగం వల్ల వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎంతో కసిగా పనిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపినేని విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడులో జరిగిన జంట హత్యల కేసులో పిన్నెల్లి సోదరులకు ఎలాంటి సంబంధం లేకున్నా చంద్రబాబునాయుడు కక్షకట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి పిన్నెల్లి సోదరులను ఆ కేసులో ఇరికించారని ఆయన ఆరోపించారు. ఆధిపత్య పోరులో భాగంగా తెలుగు దేశం పార్టీలోని వారే రెండు వర్గాలుగా ఏర్పడి ఒక వర్గం వారు హత్యలు చేయించారని హత్యకు గురైన వారి బంధువులు జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేశారన్నారు. అయితే పిన్నెల్లి సోదరులను ఎదుర్కోలేక చంద్రబాబు, లోకేష్ కలిసి ఈ కుట్రకు ఒడిగట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్షపూరిత రాజకీయాలను సాగుతున్నాయన్నారు. ఇప్పటికే వల్లభనేని వంశీ, పోసాని కృష్ణమురళీ, కాకాని గోవర్ధన్‌రెడ్డిలతో పాటు ఐఏఎస్, ఐపీఎస్‌లను సైతం అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టించి కూటమి ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెడుతోందన్నారు. చంద్రబాబు, లోకేష్‌లు వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను ఎంత ఇబ్బంది పెట్టినా ఎవరూ భయపడి వెనకడుగు వేసేవారు లేరన్నారు. బంతిని గట్టిగా కింద కొడితే అంతకు మించి వేగంగా పైకి లేస్తుందని అలాగే వైఎస్సార్ సీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టేకొద్ది వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కసిగా పనిచేస్తారన్నారు. ఈవిషయాన్ని చంద్రబాబు, లోకేష్ గుర్తుంచుకోవాలని విశ్వనాథ్‌రెడ్డి హితవు పలికారు. ఇప్పటికైనా చంద్రబాబునాయుడు, లోకేష్‌లతో పాటు కూటమి పార్టీల నాయకులు కక్షపూరిత రాజకీయాలు మానుకొని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలిపారు.

ఘనంగా రమేష్‌కుమార్ రెడ్డి పుట్టినరోజు వేడుక



వైఎస్సార్‌సీపీ శ్రేణుల నడుమ కేక్ కట్ చేస్తున్న రమేష్‌కుమార్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డి 60వ పుట్టినరోజు వేడుకలు లక్కిరెడ్డిపల్లిలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్సన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ ఉమాపతి రెడ్డి, రాయచోటి మాజీ మండల అధ్యక్షులు పోలు సుబ్బారెడ్డి, గాలివీడు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ యదుభూషన్ రెడ్డి, కౌన్సిలర్ కొలిమి హరుణ్ బాషా, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సింగల్ విండో మాజీ ప్రెసిడెంటు ఎర్రంరెడ్డి, మండల ఉపాధ్యక్షులు సమరసింహారెడ్డిలు భారీ కేక్ కట్ చేసి గజమాలలతో రమేష్ కుమార్ రెడ్డిని ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలందక ప్రజల అగచాట్లు



సిగమాల సతీష్ రెడ్డి

ఓబులవారిపల్లె : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ప్రజలందరికీ పథకాలు అందడంతో సుఖసంతోషాలతో గడిపారని ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చాక సంవత్సరం అయినా సంక్షేమ పథకాలు అందక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులు సిగమాల సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మంగంపేట గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేర సంవత్సర కాలం గడిచినా సూపర్ సిక్స్‌లోని ఒక పథకం కూడా ప్రజలకు అందించలేదని విమర్శించారు. చంద్రబాబు నాయుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను వెన్నుపోటు పొడవడం సర్వసాధారణమన్నారు. ప్రభుత్వంపై రాష్ట్రంలో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వడ్డెర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

రాయచోటి టౌన్ : వడ్డెర్లకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని రాష్ట్ర వడ్డెర మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కుర్రపోతులు జీవానందం డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు పాదయాత్రలో నారా లోకేష్ వడ్డెర్లను సత్యపాల్ కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకొని ఎస్టీ జాబితాలో చేర్చుతామని, అందుకు అంకితభావంతో పని చేస్తామని అప్పటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు కూడా హామీ ఇచ్చారని చెప్పారు. వారు ఇచ్చిన మాట ప్రకారం వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డెర కుల సంఘం నాయకులు పల్లపు శ్రీనివాసులు, కుంచపు ప్రసాద్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు



ఆలయ ప్రాంగణంలో మంత్రి అచ్చెన్నాయుడు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయాన్ని సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ వర్మలు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి ఆలయ ప్రదక్షిణ గావించి గర్భాలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ రంగమండపంలో సేదతీరిన వారికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

మహానాడు వేదికగా కడప ఉక్కుపై స్పష్టత ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : కడప వేదికగా జరుగుతున్న మహానాడు సందర్భంగా కడప ఉక్కుపై తెలుగుదేశం ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కడప ఉక్కు పైన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ వస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాది మంది యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. కరువు సీమలో ఉపాధి పరిశ్రమలు వస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి లభించే అవకాశం ఉంటుందన్నారు. కావున నేడు కడప వేదికగా జరిగే మహానాడులో కడప ఉక్కుపైన స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

హెచ్‌పీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్ల ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : తమ డిమాండ్ల సాధన కోసం హెచ్‌పీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్ల సంఘం నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కడప హెచ్‌పీసీఎల్ భాకరాపేట టెర్మినల్‌లో స్థానిక ట్రాన్స్‌పోర్టర్లకే మొదటి అవకాశం కల్పించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న ట్రాన్స్‌పోర్టర్లకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ స్టేట్ ట్రాన్స్‌పోర్టర్ల చట్టాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. చెన్నై మాఫియాను కట్టడి చేయాలన్నారు.

ఘనంగా ఎగువగిండి గంగమ్మ తిరునాల

తంబళ్లపల్లె : మండలంలోని గోపిదిన్నె పంచాయతీ ఉప్పులూరివాండ్లపల్లె సమీపంలో వెలసిన ఎగువగిండి గంగమ్మ తిరునాలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పూజారి భాస్కర్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు,అభిషేకాలు చేశారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. మహిళలు బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చాందీబండ్ల ప్రదర్శన అలరింపజేశాయి.

హార్సిలీహిల్స్‌పై పెనుగాలులు

బి.కొత్తకోట : హార్సిలీహిల్స్‌పై సోమవారం పెనుగాలులు వీచాయి. తెల్లవారుజాము నుంచి గాలులు విపరీతంగా వీస్తుండటంతో పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. గాలిబండ, వ్యూ పాయింట్ల వద్ద గాలుల వేగం అధికంగా ఉండటం, భీకర శబ్దాలతో వీస్తున్న కారణంగా సందర్శకులు ఈ ప్రాంతాల వైపునకు వెళ్లడం లేదు. చలి ఉండటంతో పాటు చిరుజల్లులు కురిశాయి.